క్లుప్తంగా

అయ్యప్ప స్వాములకు నిత్యాన్నదానం



భక్త తుకారాం ఆలయంలో పూజలు చేస్తున్న ఆధ్యాత్మికవేత్త జ్యోతిర్మయి

ఆరిలోవ: హనుమంతవాక వద్ద భక్త తుకారాం ఆలయంలో ఏర్పాటు చేసిన అయ్యప్ప స్వాముల మండపాన్ని శుక్రవారం ఆధ్యాత్మిక వేత్త కొండవీటి జ్యోతిర్మయి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె స్వాములతో కలిసి పూజలు చేశారు. అనంతరం అయ్యప్ప స్వాములకు జరుగుతున్న నిత్యాన్నదాన కార్యక్రమాన్ని మధ్యాహ్నం ఆమె ప్రారంభించారు. నిత్యాన్నదానం ఏర్పాటు చేస్తున్న శ్రీరామ అయ్యప్ప అన్నదాన ట్రస్ట్ సభ్యులను ఆమె అభినందించారు.

ఉజ్వల గ్యాస్ సిలిండర్ల పంపిణీ



సిలిండర్లు పంపిణీ చేస్తున్న సత్యకుమార్, తదితరులు

ఎంవీపీ కాలనీ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి ఉజ్వల యోజన 2.0 పథకం కింద లబ్ధిదారులకు గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేశారు. లాసన్స్ బే కాలనీలోని బీజేపీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ జాతీయ కార్యదర్శి వై.సత్యకుమార్ ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ బడుగుల సంక్షేమమే ధ్యేయంగా ప్రధాని మోదీ అనేక పథకాలను అందుబాటులోకి తెచ్చారన్నారు. ఈ పథకంలో భాగంగా తొలివిడతగా 9 కోట్ల మందికి గ్యాస్ కనెక్షన్లు ఇచ్చామన్నారు. రెండో విడతగా 75 లక్షల కనెక్షన్లు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణుకుమార్‌రాజు, రాష్ట్ర కోశాధికారి ఎం.నాగేంద్ర, జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

గౌరీపరమేశ్వరి ఉత్సవాలు ప్రారంభం



ఊరేగింపుగా తీసుకొస్తున్న గౌరీ పరమేశ్వరి ఉత్సవ విగ్రహం

మద్దిలపాలెం : పాత వెంకోజీపాలెంలో శ్రీసీతా రామ సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీగౌరిపరమేశ్వరుల మహోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. సీతరామాలయంలో 9 రోజుల పాటు ఈ ఉత్సవాలు జరగనున్నాయి. గవర సామాజిక వర్గ ప్రజలు తమ ఇలవేల్పుగా గైరమ్మ సంబరాలను ఎంతో ఘనంగా నిర్వహించడం ఆనవాయితీ. పాత వెంకోజీపాలెం సీతారామాలయం నుంచి మహిళలు కొత్త వెంకోజీపాలెం భూలోకమాత ఆలయానికి వెళ్లారు. అక్కడ గౌరీ పరమేశ్వరుల విగ్రహాలకు పూజలు చేశారు. తిరిగి సీతారామాలయానికి ఊరేగింపుగా తీసుకువచ్చారు. అనంతరం ఉత్సవాలను ప్రారంభించారు.

వెంకన్న ఆలయంలో క్షీరాబ్ధి ద్వాదశి పూజలు



మద్దిలపాలెం : కార్తీక మాసం క్షీరాబ్ధి ద్వాదశి సందర్భంగా కొత్త వెంకోజీపాలెంలోని వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయం భక్తులతో కళకళలాడింది. ఎంఎంటీసీ కాలనీలోని త్రిముఖ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వేకువజాము నుంచి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా శ్రీవారిని వివిధ పుష్పాలతో, తులసి దళాలతో విశేష అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు.

పెదగదిలిలో..



బీఆర్‌టీఎస్‌లో పెదగదిలి వద్ద నిర్మించిన బస్ బే

బీఆర్‌టీఎస్‌లో పెదగదిలి కూడలి వద్ద రూ.10 లక్షల వ్యయంతో బస్ బేను ఆకర్షణీయంగా నిర్మించారు. టైల్స్, సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు. రాత్రి వేళ వెలుగు కోసం విద్యుత్ దీపాలు అమర్చారు.

వెంకోజీపాలెంలో..



వెంకోజీపాలెం వద్ద బస్ బే

వెంకోజీపాలెంలో ఆంజనేయస్వామి ఆలయం ఎదురుగా రూ.24 లక్షలతో బస్ బే నిర్మించారు. రూ.16 లక్షలతో షెల్టర్, సౌకర్యాలు, రూ.8 లక్షలతో గ్రీనరీ, వాల్స్, మార్బుల్స్ ఏర్పాటు చేశారు.

ఆర్కే బీచ్‌లో..



ఆర్‌కే బీచ్ రోడ్డు పక్కన బస్ బే

ఆర్కే బీచ్ వద్ద రూ.16 లక్షలతో బస్ బే నిర్మిస్తున్నారు. గ్రానైట్‌తో ఫ్లోరింగ్, విద్యుత్ దీపాలు, టైల్స్ ఏర్పాటు చేస్తున్నారు. సందర్శకులకు సౌకర్యంగా ఉండేటట్లు తీర్చిదిద్దుతున్నారు. కొద్ది రోజుల్లో ఈ బస్‌బే అందుబాటులోకి రానుంది.

ఆధునిక హంగులతో బస్‌బేలు






ఆరిలోవ: సౌకర్యాల లేమితో కొట్టుమిట్టాడే బస్సు షెల్టర్లు ప్రస్తుతం ఆధునిక హంగులతో కనువిందు చేస్తున్నాయి. నగరంలో ప్రయాణికుల సౌకర్యార్థం జీవీఎంసీ అధికారులు స్మార్ట్‌సిటీ అభివృద్ధిలో భాగంగా బస్ బేలు నిర్మించారు. తూర్పు నియోజకవర్గంలో ఐదు చోట్ల బస్ బేలు ఏర్పాటు చేశారు. విద్యుద్దీపాలు, టైల్స్, గ్రానైట్ ఫ్లోరింగ్‌తో అందంగా తీర్చిదిద్దారు. బస్ బేలో ప్రయాణికులు కూర్చోవడానికి సౌకర్యమంతమైన సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు. విశాలంగా గాలి, వెలుతురు వచ్చేటట్లు చర్యలు తీసుకున్నారు. వర్షానికి తడవకుండా సదుపాయం కల్పించారు. నియోజకవర్గంలో బీఆర్‌టీఎస్‌లో పెదగదిలి కూడలి, వెంకోజీపాలెంలో ఆంజనేయ స్వామి ఆలయం ఎదురుగా, చినవాల్తేరులో ఏయూ అవుట్ గేట్ సమీపం, బీచ్‌రోడ్డులో ఆర్కే బీచ్ వద్ద బస్ బేలు నిర్మించారు.

చినవాల్తేరులో..

చినవాల్తేరులో ఏయూ అవుట్ గేట్ సమీపంలో రూ.19.5 లక్షలతో బస్ బే నిర్మించారు. ఇక్కడ గ్రానైట్‌తో ఫ్లోరింగ్, విద్యుత్ దీపాలు, టైల్స్‌తో ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తోంది.



అప్పూఘర్ ప్రాంతం కైలాసగిరి రోప్‌వే వద్ద రూ.15 లక్షలతో బస్ బే నిర్మించారు. కైలాసగిరికి వెళ్లే సందర్శకులకు ఇది అందుబాటులో ఉంది.

నాడు

ప్రయాణికులకు అప్పట్లో సరైన సదుపాయాలు ఉండేవి కాదు. శిథిలమైన బస్టాపులు, వర్షం వస్తే కారే బస్టాండ్లతో ప్రజలు ఇక్కట్లు పడేవారు. చాలా చోట్ల అసలు బస్టాప్‌లే ఉండేవి కాదు. చెట్ల కింద, షాపుల ముందు ప్రజలు బస్సుల కోసం పడిగాపులు పడేవారు. ఎండకి ఎండి, వానకి తడిసి ఇబ్బందులు పడేవారు. పొద్దుగూకితే బస్టాపులు విద్యుత్ సౌకర్యం లేక చిమ్మచీకట్లలోకి జారుకునేవి. బిచ్చగాళ్లు, ఆకతాయిలు బస్టాపులను ఆక్రమించుకునే వారు. ఆకతాయిలు బస్టాపులో వేచి చూసే మహిళలను ఇబ్బంది పెట్టేవారు. ఇప్పుడు ప్రభుత్వం ఆధునికీకరించిన నూతన బస్‌బేల వల్ల అటువంటి సమస్యలకు చెక్ పడింది.

నేడు

పేద, సామాన్య ప్రజల సంక్షేమానికి పాటు పడుతున్న జగనన్న ప్రభుత్వం అభివృద్ధిలో భాగంగా ఆధునిక బస్‌బేలు నిర్మించింది. చక్కటి విద్యుత్, కూర్చునేందుకు సిమెంట్ దిమ్మలు బస్‌బేల్లో ఏర్పాటు చేయడం వల్ల ప్రయాణికులు బస్సుల కోసం వేచి చూసేందుకు ఎలాంటి ఇబ్బంది పడటం లేదు.

సౌకర్యవంతంగా ఉన్నాయి..



నియోజకవర్గంలో నిర్మించిన బస్ బేలు ఎంతో సౌకర్యవంతంగా ఉన్నాయి. గతంలో ఉండే బస్ స్టాప్‌లలో కూర్చోవడానికి సరైన వసతి ఉండేది కాదు. ఇప్పుడు మంచి డిజైన్‌తో బెంచీలు ఏర్పాటు చేశారు. కొత్తదనంతో నిర్మించిన బస్ బేలు చూడడానికి ఆకర్షణీయంగా ఉన్నాయి.

– లక్ష్మారెడ్డి, పెదవాల్తేరు

వర్షం పడినా ఇబ్బంది లేదు..



బస్ షెల్టర్లను ఆధునికీకరించి అందంగా తీర్చిదిద్దారు. వర్షం పడినప్పుడు కూడా వీటిలో ఎలాంటి ఇబ్బందిలేకుండా ఉండగలుగుతున్నాం. మంచి గాలి, వెలుతురు వచ్చేలా ప్లాన్ చేసి బస్ బేలను నిర్మించారు. కాలేజీకి వెళ్లే సమయంలో బస్ కోసం నిరీక్షించడానికి సౌకర్యంగా ఉన్నాయి.

– ఎం.వి.తేజ , బీటెక్ విద్యార్థి, ఆరిలోవ

అనంత పద్మనాభ స్వామి దీపోత్సవానికి రూ.8 లక్షలు

- సింహాచలం దేవస్థానం నుంచి కేటాయింపు

సింహాచలం: పద్మనాభంలోని అనంతపద్మనాభ స్వామి దేవస్థానంలో వచ్చేనెలలో జరిగే దీపోత్సవం నిర్వహణకు భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చొరవతో సింహాచలం దేవస్థానం రూ.8 లక్షలు కేటాయించింది. దీపోత్సవం నిర్వహణకు నిధులు కేటాయించాలని సింహాచలం దేవస్థానం అధికారులకు ఇటీవల ముత్తంశెట్టి విజ్ఞప్తి చేశారు. దీంతో అనంతపద్మనాభస్వామి దేవస్థానం ఈవో దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ ద్వారా సింహాచలం దేవస్థానం ఈవోకు ప్రతిపాదనలు పంపారు. ఈ మేరకు సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్‌కు ఆ ప్రతిపాదనని పంపారు. ఆ ప్రతిపాదనకు కమిషనర్ ఆమోద ముద్ర వేశారు.

డాక్టర్ చీటీ లేనిదే యాంటీ బయోటిక్స్ వాడరాదు

మహారాణిపేట : కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. యాంటీ మైక్రోబియల్ వారోత్సాల సందర్భంగా నిర్వహించిన ఈ ర్యాలీని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. సత్యం కూడలి మీదుగా బయలుదేరిన ర్యాలీ తిరిగి డీఎంహెచ్‌వో కార్యాలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు మాట్లాడుతూ డాక్టర్ ప్రిస్కిప్షన్ లేనిదే యాంటీ బయోటిక్స్ ఇవ్వకూడదని, రోగులు వాడకూడదని తెలిపారు. జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ బి.ఉమావతి, జిల్లా మీడియా విస్తరణ అధికారి బి.నాగేశ్వరరావు, హెల్త్ ఎడ్యుకేటర్ సయ్యద్ బేగం, రవి శంకర్, నాయుడు, బి.నాగభూషణం, నర్సింగ్ విద్యార్థినులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ కులగణన నిర్ణయం హర్షణీయం

ఎంవీపీ కాలనీ: రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న బీసీ కులగణన నిర్ణయం హర్షణీయమని ఎమ్మెల్సీ కుడిపూడి సూర్యనారాయణరావు అన్నారు. ఎంవీపీ కాలనీలోని ఓ నివాసంలో ఆయన బీసీ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ జనాభాలో వంద కోట్లు మంది బీసీలే ఉంటారన్నారు. బీసీ కుల గణనపై 1931 నుంచి పోరాటాలు జరుగుతూనే ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశంపై సానుకూల నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. పేదరిక నిర్మూలనకు బీసీ కులగణన సాకారమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో శెట్టిబలిజ సంఘం చీఫ్ అడ్వైజర్ ఆచార్య ఎం.వివేకానందమూర్తి, అధ్యక్షుడు జి.మధుసూదనరావు, పితాని ప్రసాద్, గుత్తుల వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పీఎఫ్ కార్యాలయంలో సర్వర్ డౌన్



వేచి ఉన్న పింఛనుదారులు

విశాఖ విద్య: విశాఖలోని పీఎఫ్ కార్యాలయంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో ఆన్‌లైన్ సేవలు నిలిచిపోయాయి. దీంతో వివిధ ప్రాంతాల నుంచి శుక్రవారం కార్యాలయానికి వచ్చిన పింఛన్ దారులు నిరాశతో వెనుదిరిగారు. మూడు రోజుల నుంచి ఇదే పరిస్థితి ఉందని సిబ్బంది చెబుతున్నారు. పింఛన్ కొనసాగింపునకు ఏటా పింఛనుదారులు నవంబర్, డిసెంబర్ నెలలో తమ వివరాలు ధృవీకరించుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం వారు కార్యాలయానికి క్యూ కడుతున్నారు. దీంతో నాలుగు కౌంటర్లు ఏర్పాటు చేసి, పింఛనుదారుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి, ధృవీకరిస్తున్నారు. అయితే సాంకేతిక సమస్య కారణంగా ఆన్‌లైన్ సేవలు నిలిచిపోవడంతో ప్రత్యామ్నాయంగా సెల్ ఫోన్‌ద్వారా సిబ్బంది పింఛనుదారుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. అయితే పింఛన్ దారుడి సెల్‌ఫోనుకు వచ్చే ఓటీపీ ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సిన సమయంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

ఆన్‌లైన్ సెంటర్లలో అవకాశం

పింఛనుదారులు తమకు సమీపంలోని ఆన్‌లైన్ సెంటర్లలో వివరాలు ధృవీకరించేకునే వెసులు బాటు ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ విషయం తెలియక జిల్లా నలుమూలల నుంచి విశాఖలోని పీఎఫ్ కార్యాలయానికి పింఛన్‌దారులు వస్తున్నారు. పింఛనుదారులకు అవగాహన కల్పిస్తే వారికి వ్యయప్రయాసలు తప్పుతాయి.

సముద్రానికి విష్ణు హారతి

బీచ్ రోడ్డు: లోక కల్యాణార్థం ఆర్కే బీచ్ సమీపంలో శుక్రవారం ఆధ్యాత్మిక వేత్త కొండవీటి జ్యోతిర్మయి సముద్రానికి విష్ణు హారతి ఇచ్చారు. రామ నామం ..కృష్ణ నామం చెప్పి ప్రతి క్షీరాబ్ధి ద్వాదశి నాడు సముద్రానికి గానీ, నదికి గానీ, చెరువుకు గానీ, ఇంట్లోని తులసి మొక్కకు అయినా హారతి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొండవీటి జ్యోతిర్మయి సెంటర్ ట్రస్ట్ చైర్మన్ చలపతిరావు, దుర్గాప్రసాద్ పండా, తదితరులు పాల్గొన్నారు.



సముద్రానికి విష్ణు హారతి ఇస్తున్న కొండవీటి జ్యోతిర్మయి

అగ్నివీర్‌పై విద్యార్థులకు అవగాహన



ఎన్‌సీసీ క్యాడెట్లకు అవగాహన కల్పిస్తున్న నేవీ అధికారి

దొండపర్తి: అగ్నివీర్ పథకంపై పాఠశాలల విద్యార్థులకు తూర్పు నావికాదళం అధికారులు శుక్రవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. స్టీల్‌ప్లాంట్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్, విశాఖ వ్యాలీ స్కూల్‌లో విద్యార్థులతో పాటు 6(ఏ) ఎయిర్ స్క్వాడ్రన్ ఎన్‌సీసీ యూనిట్‌లో క్యాడెట్లకు అగ్నివీర్ స్కీమ్ ద్వారా కలిగే అవకాశాలను వివరించారు.

ఎన్‌బీఏ గుర్తింపునకు సిద్ధం కండి

- ఓఎస్డీ డీవీఎస్ఎస్ ప్రసాద్

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ (గైస్)లోని వివిధ విభాగాలకు ఎన్‌బీఏ గుర్తింపునకు సంబంధించి టెక్నికల్ ఎడ్యుకేషన్ ఎన్‌బీఏ రివ్యూ అధికారి, ఓఎస్డీ డీవీఎస్ఎస్ ప్రసాద్ శుక్రవారం సమీక్షించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమీక్షలో ఆయన ఎన్‌బీఏ గుర్తింపు సాధించేందుకు అనుసరించాల్సిన విధివిధానాలను వివరించారు. ఇక్కడి సౌకర్యాలు, మౌలిక వసతులు, ప్రయోగశాలలు, తదితర అంశాలను ఎన్‌బీఏ అధికారుల బృందం పరిశీలిస్తుందని తెలిపారు. వారు కేటాయించిన మార్కుల ఆధారంగా 3 నుంచి 6 సంవత్సరాల ఎన్‌బీఏ గుర్తింపు వస్తుందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ ప్రస్తుతం గైస్‌లో కెమికల్ ఇంజినీరింగ్, పెట్రో కెమికల్స్ విభాగాలకు ఎన్‌బీఏ గుర్తింపునకు అవసరమైన చర్యలు చేపట్టామన్నారు. ఈ రెండు విభాగాలకు ఆరేళ్ల ఎన్‌బీఏ గుర్తింపు వస్తే.. తన తరఫున ప్రోత్సాహకంగా రూ.లక్షలు ఇస్తానని ప్రకటించారు.

అభివృద్ధి పనుల పరిశీలన



15వ వార్డులో వెంకోజీపాలెంలో అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య

మద్దిలపాలెం : జీవీఎంసీ 15వ వార్డులో జరుగుతున్న అభివృద్ధి పనులను కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య శుక్రవారం పరిశీలించారు. వెంకోజీపాలెం, శెట్టి బలిజ వీధిలో పర్యటించిన ఆమె స్థానికులు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రూ. 20 లక్షలతో చేపడుతున్న వాటర్ పైపులైన్ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఈఈ రహీం, పార్టీ వార్డు ఇన్‌చార్జి అప్పారి గిరిబాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు, వార్డు అధ్యక్షుడు పీలా వెంకట్, నరాల సత్తిబాబు, గొలగాని త్రినాథ్, బుగత ఏసురత్నం, నారాయణరావు, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో జీవీఎంసీ ఉద్యోగినికి గాయాలు

బీచ్ రోడ్డు: రోడ్డు ప్రమాదంలో జీవీఎంసీలో పని చేస్తున్న ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. మూడో పట్టణ సీఐ రామారావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జీవీఎంసీలో ఉద్యోగం చేస్తున్న సుంకర అప్పలనరసమ్మ పాండురంగాపురం వద్ద పని పూర్తి చేసుకుని నడుచుకుంటూ వెళ్తోంది. ఆ సమయంలో పార్క్ హోటల్ వైపు నుంచి బైక్‌పై వచ్చిన వ్యక్తి ఆమెను ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఆమె తలకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా అయ్యప్ప మహాసంగమం ప్రారంభం



కార్యక్రమాన్ని పూజతో ప్రారంభిస్తున్న అయ్యప్పస్వాములు



గోపూజ చేస్తున్న అయ్యప్పస్వాములు

ఏయూ క్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల మైదానం వేదికగా శ్రీపూర్ణ పుష్కల అయ్యప్ప సేవా ట్రస్ట్, అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ పర్యవేక్షణలో అయ్యప్ప మహాసంగమం శుక్రవారం ప్రారంభమైంది. స్థల శుద్ధి, గోపూజలతో మొదటి రోజు కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు నిర్వహించడానికి విచ్చేసిన మేల్ శాంతిలు, తంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో శ్రీపూర్ణ పుష్కల ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పైలా ఆదిమోహన్‌రెడ్డి, అఖిల భారతీయ అయ్యప్ప ప్రచార సభ అధ్యక్షుడు అయ్యప్ప దాస్, రాష్ట్ర అధ్యక్షుడు బెల్లపు హరి ప్రసాద్, అయ్యప్ప మహాసంగమం పూజా కోర్ కమిటీ చైర్మన్ ఎం.కృష్ణయ్య, ఉపాధ్యక్షుడు ధర్మాల శ్రీనివాసరెడ్డి, పూజా కమిటీ చైర్మన్ ఆదిమూలపు నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

➡ శనివారం ఉదయం 5.30 గంటలకు గణపతి హోమంతో ప్రత్యేక పూజలు ప్రారంభం కానున్నాయి. సాయంత్రం 6 గంటలకు విలక్ పూజా మహోత్సవం జరుగుతుంది. 26న తెల్లవారు జాము వరకు కేరళ నుంచి వచ్చిన మేల్ శాంతిలు, తంత్రిలు మలయాళంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

➡ 26న తెల్లవారుజామున గణపతి హోమంతో పూజలు ప్రారంభమవుతాయి. ప్రత్యేక పూజలు, పడిపూజ, అయ్యప్ప భక్తి గీతాల ఆలాపన చేస్తారు. శబరిమలను తలపించే రీతిలో మండపాలను ఏర్పాటు చేశారు.

ప్లాస్టిక్ వ్యర్థాలతో తీవ్ర అనర్థాలు



సదస్సులో ప్రసంగిస్తున్న ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు

మద్దిలపాలెం : ప్లాస్టిక్ వ్యర్థాలతో తీవ్ర అనర్థాలు తలెత్తుతాయని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు హెచ్చరించారు. కళాశాలలో ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణపై శుక్రవారం సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగంతో మానవాళికి, పర్యావరణానికి ముప్పు పొంచి ఉందన్నారు. కళాశాల ఎకో క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఇండియా యూత్ ఫర్ సొసైటీ సంస్థ కార్యదర్శి వై.అప్పలరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ పి.జయ, అకడమిక్ కో ఆర్డినేటర్ శ్రావణ్‌కుమార్, ఐక్యూ ఏసీ కో ఆర్డినేటర్ రవిబాబు పాల్గొన్నారు.